


## క్రీడలతో ఉజ్వల భవిష్యత్

- ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

వీణవంక, జనవరి 12: యువత, విద్యార్థులకు క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ టోర్నీని క్రీడాకారులను పరిచయం చేసుకొని ప్రారంభించారు. అనంతరం మాట్లాడారు. క్రీడల్లో గెలుపోటములను సమానంగా తీసుకోవాలని సూచించారు. టోర్నీ నిర్వాహకులను అభినందించారు. ఇక్కడ మాజీ ఎంపీపీ ముసిపట్ల రేణుక-తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచ్ నీల కుమారస్వామి, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు తాళ్లపెల్లి మహేశ్, నిర్వాహకులు క్రాంతికుమార్, ముజామిల్, నాయకులు ఎండీ యాసిన్, కొండాల్‌రెడ్డి ఉన్నారు.

## హుజూరాబాద్ కాంగ్రెస్‌లో 'ఫ్లెక్సీ' చిచ్చు

హుజూరాబాద్ టౌన్, జనవరి 12: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ నాయకుడు, జయన్న ఫౌండేషన్ అధినేత గుడిపాటి జయపాల్ రెడ్డి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ పార్టీలో చిచ్చు రేపింది. 'సంక్రాంతి పండుగను పురస్కరించుకొని హుజూరాబాద్ ప్రజలు, మీడియా మిత్రులకు శుభాకాంక్షలు' అంటూ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్ కుమార్, మంత్రులు డీ శ్రీధర్ బాబు, పొన్నం, సీతక్క, డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌తో పాటు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఫొటోలతో భారీ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ఇందులో హుజూరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ ఫొటో లేకపోవడం పెద్ద చర్చకు దారి తీసింది. శనివారం ఫ్లెక్సీని ఏర్పాటు చేయగా ఆదివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు తొలగించారు. దీంతో జయపాల్‌డ్డి పోలీసులను ఆశ్రయించారు. తాను సంక్రాంతి పండుగ సందర్భంగా ఏర్పాటుచేసిన శుభాకాంక్షల ఫ్లెక్సీని ఎవరు తొలగించారో..? గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. కాగా, ఫొటో పెట్టని కారణంగా ప్రణవ్ బాబు వర్గానికి చెందిన వారే తొలగించి ఉంటారని పలువురు నాయకులు ఆరోపిస్తున్నారు. అయితే కేవలం ఇది ప్రైవేటు ఫ్లెక్సీ అని, దీనికి పార్టీతో సంబంధం లేదని, ఇష్టమైన వ్యక్తుల ఫొటోలు పెట్టుకునే స్వేచ్ఛ ఉందని జయపాల్ రెడ్డి పేర్కొన్నారు.

## వివేకానందుడి విగ్రహావిష్కరణ

కథలాపూర్, జనవరి 12: కథలాపూర్ మండలం సిరికొండ గ్రామంలో ఏర్పాటు చేసిన వివేకానందుడి విగ్రహాన్ని ఆదివారం ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత గ్రామవికాశ్ సంయోజక్ జిన్న సత్యనారాయణరెడ్డి ఆవిష్కరించారు. అంతకుముందు యువకులు గ్రామంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విగ్రహదాతలు కొడిపెల్లి జలందర్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, నాయకులు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి, కొత్త సునీల్, దొప్పల జలేందర్ తదితరులు పాల్గొన్నారు.

## వేంకటేశ్వరాలయంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడి పూజలు

మారుతీనగర్, జనవరి, 12: మెట్‌పల్లి పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం గోదారంగనాథుల కల్యాణం నిర్వహించగా, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు-సరోజన దంపతులు హాజరయ్యారు. స్వామి వారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా అర్హులను ఎంపిక చేయాలి

- క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించాలి
- అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

కలెక్టరేట్, జనవరి 12: రాష్ట్రంలో 26 నుంచి ప్రారంభంకానున్న పలు సంక్షేమ పథకాల కోసం జిల్లాలో లబ్ధిదారుల ఎంపిక పకడ్బందీగా జరగాలని, ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరమే ఎంపిక జాబితాలో చేర్చాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ప్రారంభంపై ఆయా శాఖల అధికారులతో ఆదివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించి, మాట్లాడారు. నిబంధనల ప్రకారం అర్హులను ఎంపిక చేయాలని ఆదేశించారు. రైతు భరోసా పథకం కింద సాగుభూములకే ఏటా ఎకరాకు రూ.12వేల చొప్పున అందించనున్నట్లు పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి దరఖాస్తులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సర్వే పూర్తి చేయడాన్ని అభినందించారు. 2.10లక్షల ఇండ్ల సర్వే చేసి 66,271 దరఖాస్తులు




మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

అర్హులైనవిగా గుర్తించినట్లు పేర్కొన్నారు. భూమి లేని వ్యవసాయ కూలీలకు ఏటా రూ.12వేలు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద అందించనున్నట్లు, 2023-24 ఆర్థిక సంవత్సరంలో 20 రోజులకు పైగా ఉపాధి పని చేసి ఉండాలన్నారు. కొత్త రేషన్‌కార్డుల దరఖాస్తులు స్వీకరించి, అర్హులను ఎంపిక చేయాలన్నారు. 100 దరఖాస్తులకు ఒక అధికారిని నియమించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు, వార్డు అధికారులకు బాధ్యతలు అప్పగించాలన్నారు. 15లోగా మండలాల్లో అవగాహన సదస్సులు, శిక్షణ నిర్వహించాలని, 16 నుంచి 20వరకు గ్రామాల్లో సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. 21 నుంచి 23 వరకు రెవెన్యూ గ్రామాల వారీగా గ్రామ సభలు నిర్వహించి, అర్హుల వివరాలు చదివి వినిపించాలని, 24,25 తేదీల్లో గ్రామ సభల్లో ఎంపిక చేసిన వివరాలు జిల్లా అధికారులు పరిశీలిస్తారని వెల్లడించారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని మండల ప్రత్యేకాధికారులు ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, ఆర్డీవోలు కే మహేశ్వర్, రమేశ్‌బాబు, ఇన్‌చార్జి డీఆర్‌వో పవన్‌కుమార్, పలు ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# యజ్ఞవరాహ క్షేత్రంలో తిరుప్పావై సదస్సు

కమాన్‌చౌరస్తా, జనవరి 12: కరీంనగర్‌లోని యజ్ఞవరాహక్షేత్రంలో సర్వవైదిక సంస్థానం ట్రస్ట్ ఆధ్వర్యంలో గోదా మధుర రాసిక్యమ్ పేరుతో తిరుప్పావై సదస్సును ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ట్రస్టు ఉపకులపతి శ్రీభాష్యం వరప్రసాదశర్మ అధ్యక్షత వహించి మాట్లాడుతూ, సంస్థానం ట్రస్టు ద్వారా క్షేత్రంతో పాటు పలు చోట్ల అనేక ధార్మిక, ఆధ్యాత్మిక, వైదిక కార్యక్రమాలు నిర్వహించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో గోపాల కృష్ణమాచార్య స్వామి, భద్రాద్రి దేవస్థానం స్థానాచార్యులు కేఈ స్థలశాయి, డాక్టర్ ముడుంబై నరసింహరంగాచార్యులు, కండ్లకుంట్ల శ్రీనివాసాచార్యులు, మరింగంటి అనంతాచార్యులు, సముద్రాల శఠగోపాచార్యులు పత్ర సమర్పణలు చేశారు. ఇక్కడ ఆలయ ట్రస్టు సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



ప్రబంధ గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న పండితులు

# పాడె కట్టి.. రెండోసారి అంత్యక్రియలు నిర్వహించి

- శిలాయుగంలో మొదలైన ప్రక్రియను ఆచరించిన డిస్కవరీ మ్యాన్ రెడ్డి రత్నాకర్ రెడ్డి
- చిన్నకర్మ రోజు కాట్నం ఎముకలతో దహన సంస్కారాలు
- స్వగ్రామం గంగిపెల్లిలో నిర్వహణ

మానకొండూర్ రూరల్, జనవరి 12: నవీన శిలాయుగం అంత్య దశలో రెండోసారి దహనం చేసే ప్రక్రియ ప్రారంభమైందని, ఆ ప్రక్రియ నేటికీ ఆచరణ రూపంలో కొనసాగుతూ వస్తున్నదని చరిత్ర పరిశోధకుడు డిస్కవరీ మ్యాన్ రెడ్డి రత్నాకర్ రెడ్డి పేర్కొన్నారు. తన స్వగ్రామం గంగిపల్లిలో తన తల్లి రాధమ్మ పార్థీవదేహాన్ని దహనం చేసిన తర్వాత చిన్నకర్మలో భాగంగా (10వ రోజు) ఆదివారం కాట్నం నుంచి ఎముకలు సేకరించారు. చిన్న పాడె తయారు చేసి దానిపై ఎముకలు పెట్టి, నిప్పు పెట్టారు. తిరిగి అందులో నుంచి ఎముకలు సేకరించి, నదిలో కలపడానికి చిన్న కుండలో భద్రపరిచినట్లు రత్నాకర్‌రెడ్డి చెప్పారు. జనగామ జిల్లా వడ్లకొండ గ్రామంలో సుమారుగా 4వేల ఏండ్ల కిందటి ఆదిమ మానవులు నవీన శిలాయుగం అంత్య



పాడె కట్టి, కాట్నం పేర్చుతున్న డిస్కవరీ మ్యాన్ రెడ్డి రత్నాకర్ రెడ్డి, సోదరుడు రెడ్డి సంపత్ రెడ్డి

దశలో రెండోసారి దహనం చేసిన చారిత్రక ఆధారాలను దేశంలో తొలిసారిగా తాను గుర్తించానని గుర్తుచేశారు. ఇదే సంస్కృతి కొద్ది మార్పులతో తన కుటుంబ వారసత్వంగా వస్తున్నదని పేర్కొన్నాడు. శిలా యుగంలో మొదలైన శవ దహన సంస్కృతిలోని భిన్న రూపాలు నేటికి అనేక ప్రాంతాల్లో కొనసాగుతూ వస్తున్నాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు సైతం ఉన్నారు.

## 200 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు

- కరీంనగర్‌లో పంపిణీ చేసిన ఎమ్మెల్యే గంగుల



లబ్ధిదారుకు చెక్కుల అందిస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

హౌసింగ్‌బోర్డుకాలనీ, జనవరి 12: కరీంనగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆదివారం కరీంనగర్ నియోజకవర్గంలోని సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. రూ.47 లక్షల విలువైన చెక్కులను 200 మందికి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్‌ది అరాచక పాలన

కలెక్టరేట్, జనవరి 12: రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం అంటూ సీఎం రేవంత్ రెడ్డి అరాచక పాలన సాగిస్తున్నాడని ప్రజాస్వామ్య పరిరక్షణ వేదిక జిల్లా శాఖ అధ్యక్షుడు ఎన్ మదన్‌మోహన్ ఆరోపించారు. ఆదివారం నగరంలోని కోతిరాంపూర్‌లోని సంఘం జిల్లా శాఖ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని, మాట్లాడారు. రాష్ట్రంలో ఏడాదిగా కొనసాగుతున్న అవినీతి, అక్రమాలపై ప్రశ్నించిన జర్నలిస్టులను అణిచివేసేలా కాంగ్రెస్ పాలన సాగుతోందని విమర్శించారు. ఈ క్రమంలోనే జనగామ జిల్లాలో జర్నలిస్టు రాజ్‌కుమార్‌ను అరెస్టు చేసి జైలులో పెట్టారని మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికల టైంలో కాంగ్రెస్‌కు అనుకూలంగా పనిచేసిన అతను, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలంటూ నాయకులను, ప్రజాప్రతినిధులను ప్రశ్నిస్తుండడాన్ని జీర్ణించుకోలేక, అక్రమంగా అరెస్టు చేసి జైలుకు పంపించారని దుయ్యబట్టారు. రేవంత్‌రెడ్డి తన సొంత సెగ్మెంట్‌లోనూ గిరిజనులపై ఇదే తరహాలో వ్యవహరించి జైలుకు పంపించడం తగదన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలు అమలు చేయాలని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు తనవంతు కృషి చేయాలని కోరారు. లేదంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రతినిధులు రాజ్ మహ్మద్, వెంకటమల్లయ్య, ఎల్.రాంనారాయణ, మనీష్‌కుమార్, ఈర్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ కాలేజీకి దేహదానం

- ఆదర్శం స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు నర్సపురం రవీందర్
- అనారోగ్యంతో మృతిచెందిన తల్లి మృతదేహం అందజేత

గొల్లపల్లి, జనవరి 12: మరాణానంతరం తన తల్లి మృతదేహాన్ని మెడికల్ కళాశాల విద్యార్థుల ఉపయోగార్థం అందజేసి ఆదర్శంగా నిలిచారు.. గొల్లపల్లి మండల కేంద్రానికి చెందిన రవీందర్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు నర్సపురం రవీందర్. గ్రామానికి చెందిన నర్సపురం పోషవ్వ (90) అనారోగ్యంతో ఆదివారం తెల్లవారు జామున మృతి చెందారు. ఈ క్రమంలో ఆమె మృతదేహాన్ని జగిత్యాల మెడికల్ కళాశాలకు అప్పగించాలని నిర్ణయించుకున్నారు. సమాచారం మేరకు మెడికల్ కళాశాల సిబ్బంది వచ్చి పోషవ్వ మృత దేహాన్ని కళాశాలకు తరలించారు. ఈ సందర్భంగా రవీందర్‌ను పలువురు అభినందించారు.



జగిత్యాల మెడికల్ కళాశాలకు పోషవ్వ మృతదేహాన్ని అప్పగిస్తున్న రవీందర్